# దేవ్వుడు

పార్వతి పల్లెటూరిపడుచు. ఆమె తాత తండ్రు లెడమచేత లౌకిక సంపత్తిని, కుడిచేత వైదిక సంపత్తిని పెట్టుకొని పుట్టిరి. ఆమె మేనమామలు కొందర రధ్యాపకులు, మఱికొందరు న్యాయవాదులు.

పార్వతి వీధిబడిలోఁ జదివికొని నాలుగవక్లాసు ప్యాసాయెను. వీధి నాటకములును, పగటివేసములును జూచి మానవలీలలను గ్రహించెను. పురాణముల నన్నిటిని విని ఐహికాముష్మికముల వెలను దెలిసికొనెను.

పార్వతికి యధాసమయమునఁ బెండ్లియాయెను. దానికిఫలముగా పట్నమునకు వలసపోయెను.

పార్వతి మగనిపేరు శివరావు. అతఁడు వకీలు. ఆ దంపతుల కొక కుఱ్ఱఁడు వానిపేరు రాముఁడు.

రాముఁడు గర్భస్థుడై సీతారామాంజనేయమును వినెను. తత్త్వముల వినుకలితో శైశవము గడపెను. రామనామముతో అన్నప్రాశ మొనరించెను. పార్వతి తన రాముని లీలలను కృష్ణలీలలతో దిద్దికొనెను. రాముఁడు క్రమ క్రమముగా బాలుఁ డాయెను.

రాముఁడు పట్టుగోచితో వెండికంచము ముందుఁ గూరుచుండెను. రెండు కబళములు తినెను. పిదపనేదో పనిమీఁద పార్వతి పాకశాలలోని కేగెను.

నోటినుండి కంచమునకు, కంచమునుండి నోటికిని మరపలెఁ దిరుగవలసిన రామునిచేయి యీ రెంటికిని నడుమనున్న యాకాశమున విశ్రాంతి తీసికొనియెను. షడ్రసములను పిండవలసిన దంతయంత్రము హఠాత్తుగా ఆగిపోయెను. రాముడు రాతిబొమ్మవలెఁ గూరుచుండి యుండెను.

కొలదిసేపటిలోనే తల్లివచ్చి చూచి – "మీ నాయనగారికి వలెనే నీకును మఱపు! అన్నము తినుట మఱతువటరా?" అని యనెను. రాము దులికిపడి "కాదే అమ్మా! రాత్రి నీవు చెప్పిన గజేంద్రుడు ఆ కీకారణ్యములోని ఆ పెద్ద చెఱువులోనికి దిగక మన పంపు దగ్గఱకు వచ్చి నీరుత్రాగ లేక పోయెనేమి? అని ఆలోచించుచుంటి"నని యనెను.

"ఇదియా ఆలోచన? మొన మొన్ననేకదా మనయింట పంపు పెట్టినది" అని పార్వతి యనెను.

"అవు నవును."

"ఇక నన్నము తిను."

రాముని చేయి మరల నాడఁ దొడగెను.

పార్వతి రామునకు లాగు తొడిగెను. రామనామము లద్దిన రుమాలు తీసి చొక్కా వేసెను. రామరక్ష పఠించి భటుని కిచ్చి బడికిఁ బంపెను. రాముఁడు రామకవచము బఠించుకొనుచు బడికి పోయెను.

ఉపాధ్యాయుఁడు వచ్చి బాలుర నమస్కారములందుకొనెను. కొంతసేపటికి ప్రవచన మారంభమాయెను. ఉపాధ్యాయుఁడు వేలు పైకెత్తి యిటు లడిగెను: "మన నెత్తిమీద నేమున్నది?"

"జుట్టు" అని తడుముకొనకుండ నొకఁడు సమాధానము చెప్పెను.

ఉపాధ్యాయుఁడు నవ్వి చేయి కొంచెము పయికెత్తి – "మనమీద నేమి యున్నది?" అని ప్రశ్నించెను.

"ఇల్లు."

ఉపాధ్యాయుఁడు విసువుతో నిటులనెను: "నిన్న చెప్పిన పాఠములో నే మున్నదో అది చెప్పవలెను. కృష్ణా! నీవు?" – కృష్ణుఁడు నీళ్ళు నమలెను. ఉపాధ్యాయునకు కోపము వచ్చెను. అతఁడు రివ్వున వాకిటిలోనికిఁ బరువిడి బెత్తముతో ఆకసము చూపి – "అక్కడ, రామా! నీవు చెప్పు?" అనెను.

"దేవుడు."

"వెధవ. కనఁబడునని చెప్పలేవు. కనఁబడని వానిని కనఁబడినటులు చెప్పవత్తువు. మాటకుముందు నీకు దేవుఁడు! ఆగు. నీకు దేవుఁడు కనబడునటులు చేయుదును" అని ఉపాధ్యాయుఁడు వచ్చి కుర్చీలో కూరుచుండెను.

రాముఁడు గబగబ ఉపాధ్యాయుని కడకేగి – "నాకు దేవుని జూపింపుఁడు" అని యడిగెను.

బాలుర మనస్తత్వ మెరుగని ఉపాధ్యాయుని శాంతి యెంతసేపు? పంతులవారి యెఱ్ఱని కన్నుల కొలిమినుండి కెంపులురాలెను. అతఁడు రాముని చేతిమీఁద బెత్తము నుపయోగించి – "దెబ్బలో దేవుఁడున్నా"డని అఱచెను. "రామ రామ రామ" అని రాముఁ డాక్రందించెను.

రాముఁ డెటులో మధ్యాహ్న భోజన మొనరింపఁ గలిగెను గాని మఱి సాయంత్రాన భోజన మొనరింపఁజాలక పోయెను. అతఁ డొడలు తడుముకొనియు, అఱచేయి చూచికొనియు లోలోపలనే యేడ్చెను. తుద కా రహస్యము నతఁడు దాపఁజాలక పోయెను. ఏడ్పు క్రమముగా పెద్దదై వెక్కులలోనికి దిగెను.

పార్వతి బెదురుచు వచ్చి గుప్ప కుత్తుకతో "ఏమికావలయునురా నాయనా?" అని యడిగెను.

"అమ్మా! దేవుఁడు దేవుఁడు, క-కనఁబడ - కనఁబడలేదే?"

"దేవుఁడు కనఁబడునా నాయనా? తాతగారి ఊరు పోదుము. అచట కొండ మీఁది గుడిలో దేవుఁడు కనఁబడును."

"అమ్మా! నే నక్కడికి వెళ్ళితిని; కనఁబడలేదే. అమ్మా! నీవు చెప్పితివే - ఆ యాకాశములో - అక్కడ - అక్కడే దేవుఁడున్నాడని నేననంగా పంతులుగారు దెబ్బలో దేవుఁ డున్నాఁడని కొట్టిరి. ఇదిగో దెబ్బ! ఇందులో ఎంత వెతికినను దేవుఁడు కనఁబడలేదే" - అని చేయి చూచుకొనుచు వెక్కివెక్కి యేడ్చెను. పార్వతి రాముని చేతిని పరికించెను. అది పూరీవలె పొంగి యుండెను. ఆమె కన్నులు జలజల వర్షించెను.

"కనఁబడడూ - కనఁబడడూ? ఇంతేనా?" అని రాముడు విలపించెను.

"కనఁబడును - కనఁబడును" అని పార్వతి మగని కడకు వెళ్ళెను.

దెబ్బలోఁ జూపులఁగ్రుచ్చి చూచుకొనుచు - "ఏడి? ఏడి?" అని రాముడు ఆక్రందించెను.

* * * *

పార్వతి తన యెదుట నున్నటులు శివరావెఱుఁగఁడు అతఁడొక బండెడు కాకితములలో తల పాతుకొని కూరుచుండి యుండెను. తుపాను రానీ, భూమి బ్రద్దలుగా బగులనీ అది అతనికిఁ దెలియదు.

"చూచితిరా, యెంతపని జరిగినదో?"

"రెస్ జూడికేటా" అని మొగమెత్తి చూచి, "ఆఁ వడ్డించు" అని యనెను.

"ఎప్పుడును పరధ్యానమె! ఇది వడ్డించు వేళయేనా? పంతులుగారు అబ్బాయి చేతిమీద వడ్డించిరి. చేయి పగిలినది."

"ఆఁ పాడుపంతులు. అబ్బాయిని ఆ బడి మానిపించు. నేఁ జెప్పగాఁ వింటివా? కిరస్తానీ బడి అనియు, మాలబడి యనియు, మడిగట్టు కొని కూర్చుంటివి. ఇపుడు

తెలిసి వచ్చినదా? అబ్బాయిని మిషన్‌బడి లోనికిఁ బంపినచో పూవువలెఁ జక్కఁగా నింటికి వచ్చెడివాడు. పో–" అని శివరావు మరల దస్తావేజులలోఁ గూరుకొని పోయెను.

పార్వతి కిపుడు రాముని కన్న నెక్కువ దెబ్బ తగిలెను.

దానికి ముందుగా ఆమె యింటిలోనికిఁ జనెను.

అదిచూచుచున్న శంకరయ్య మొదలగు క్లయింట్లు సిగ్గుపడి ఆ గది నుండి వెడలిపోవుటయు శివరావెఱుఁగడు.

మఱునాటి ప్రొద్దున శివరావు తడిపొడిగా స్నానము చేసివచ్చి పీట మీఁదఁ గూరుచుండెను. పార్వతి రాము నెత్తుకొని కాఫీగిన్నె పట్టుకొని అక్కడికి వచ్చెను.

శివరావాలోంచిచు వెలుపలఁగొంతయు, లోపలఁ గొంతయుఁ దడియునటులు నోరిలోపల కాఫీ పోసికొనుచుండెను. అపుడు పార్వతి "ఇదుగో! అబ్బాయి చేయి!" అని చూపెను.

శివరావటు చూచి– "ఆఁ! ఎంత దెబ్బ! హర్ట్!" అనెను.

ఈ దెబ్బ మగనిమనసులో నాటియుండునని యనుకొని సంతసించి పార్వతి యిటులనెను – "కుఱ్ఱవాడి నిటుల కొట్టరాదని ఉపాధ్యాయులకుఁ దెలియునటులు చేయవలయును."

శివరావు గుక్కెడు కాఫీతోఁ ఉద్దుకుడుచుకొని– "అవునవును. తెలియునటులు చేయవలయును. మేజిస్ట్రేటు కోర్టులో దావా పడవేయుము. ఇంట తల్లి కొట్టినటుల కాకుండ పంతులే కొట్టినట్లు సాక్ష్యము కావలయును. బడికుఱ్ఱవాండ్ర సాక్ష్యము చాల బలము. వాళ్ళు తప్పక నికరము చెప్పుదురు." అని యనెను.

ఈ మాటలు విని పార్వతి తెల్లఁబోయి – "ఈ కుఱ్ఱఁడెవఁడో నే నెవతెనో తమ రెవరో గుఱుతుండియే మాటలాడుచుంటిరా?" అని యడిగెను. శివరావున కపుడుజ్ఞప్తికి కలిగెను. అతఁడు చిన్నఁబోయి రాముని దాపునకుఁ దీసికొని చేయి చూచి– "అయ్యబాబో! ఇంతవరకును డాక్టరును పిలువలేదా? ముందు మందు వేయించు, సరియ కాని రామా? పంతులెందులకు కొట్టెను?" అని అడిగెను.

"ఆకాశముపై నేమున్నదని పంతులుగా రడిగిరి. మబ్బుల పారము మఱచి అమ్మ చెప్పిన పారము ప్రకారము 'దేవుడు' అని సమాధానము చెప్పితిని పంతులుగారు గుడ్లెఱ్ఱచేసి– "కాదురా. దెబ్బలో దేవుఁడున్నాఁడని పళ పళ కొట్టిరి. కాని దేవుఁడు మాత్రము కనబడలేదు."

"దేవుఁడు దెబ్బలోఁ గనపడునటరా?"

"నాయనా? నీవుకోర్టుకు బోవుదువే? అక్కడ దేవుఁడుండునా?"

"మీ యమ్మ నీ కీ దేవుని పిచ్చి నూరిపోసినది. కోర్టునందే దేవుఁడు లేనిచో నెక్కడ నుండును?"

"నాయనా! నాకును జూపుదువా?"

"పోరా! నీవు కామారపు జీడివి."

కోర్టులో దేవుఁడుండును. గనుకనే దైనందినమును కోర్టుకు వెళ్ళుచుండ వలయును అని రాముఁ డాలోచించుకొనుచుండెను.

పార్వతి– "రామా! ఇఁకఁజాలుగాని ముందు మందు వేయించెదనిటురా" అని యనెను.

"ఆఁ. ఆ పని ముందు చెయ్యవలెను" అనిచెప్పి శివరావు తన కర్తవ్యము నంతయు ఆ వాక్యముతోడనే సమాప్తించి ఆఫీసుగదిలోనికి వెళ్ళిపోయెను.

* * * *

రాయల గ్రామమున వేంచేసియున్న శ్రీమల్లికార్జునస్వామి వారి యీనాము భూముల హక్కుల గుఱించి ధర్మకర్తలకును రైతులకును దావా సంఘటించెను.

**వాదులు :** శివుని శంకరయ్య యీ శరభయ్య యీ ధూర్జటి వగైరా.

**ప్రతివాదులు :** శ్రీ ముక్కంటి జంగమలింగము అయ్యావార్లు.

"శిస్తు హక్కు మాత్రమే ధర్మకర్తల" దని శివరావు వాదము.

"పది పదియేనేండ్ల యీ నడుమ నాలుగయిదు తడవల వాదులు, ధర్మకర్త యిచ్ఛానుసారముగా కొన్ని భూములనుండి తొలగిరి. మరల ఉభయేచ్ఛానుసారముగా వేఱు పొలములలోఁ బ్రవేశించిరి. నూఱేండ్ల నుండియు నిట్టి యాచారమున్నదనుటకు ఋజువు కలదు. వాదుల వ్రాలుగల కాగితములు కోర్టువారికడఁ గలవు. దాతృ ప్రతి గృహీతల స్వత్వమును శాసనములు ఋజువు చేయును. ఈ భూములకు హక్కు దేవునిది. ధర్మకర్త దేవునికి ప్రతినిధి. తిరువాన్‌కూరు మొదలగు కొన్ని రాజ్యములు దేవునివి. రాజులు ప్రతినిధులు. దేవుని సర్వాధికారమును లేనిది." అనికోటిలింగము వాదము.

అంతలో కోర్టువారి అనుమతిని శివరావు లేచి– "ఈ వాదమంతయు ఆచారము మీఁద బ్రతుకుచున్నది. కాని ఆచారము మాఱును. ఈ 47వ సంవత్సరము ఆచారములకు గొడ్డలిపెట్టు. శాసనమునకు గూడ ఆచారమే మూలము. ఆ యాచారము మాఱును, మాఱుచున్నది, మాఱఁగలదు. ఇపుడు భూమిహక్కు నాగలిది. నేఁడు దేవుఁడు కూడ శాసనసభల మాట వినవలెను. రాతిదేవుని కేమి తెలియును? రాతినడ్డపెట్టుకొని "నేనే

దేవుఁడనని యసుటకు రాజు జంకఁడు. రాజు తన స్వార్థమునకే ప్రతినిధి అని చెప్పుచుండగా శంకరయ్య శివరావు చెవి కేదియో అందించెను. అంత శివరావు మరలఁ దన వాదము నందుకొని "మా క్లయింట్లు దేవుడు లేడనియందురు" అని చెప్పుమండగా నడుమ కోర్టువారడ్డువచ్చి "దేవుఁడు కలఁడని మీరొప్పుకొందురా? ఒప్పుకొనరా?" అని శివరావును ప్రశ్నించిరి.

"చిత్తము. క్షమింపవలెను. నాకు పైని ఏడు తరములవారు దేవుని చూడలేదు. నా క్లయింట్లును చూడలేదు. వారు దేవుడు లేడని యందురు."

అని శివరా వనుచుండఁగా అతనికొడుకు రాముఁడు – ఎటులు లోనికి వచ్చెనో యెవరు నెరుగరు – శివరావు ముందరి బల్లయెక్కి శివరావున కెదురుగా నిల్చి – "నాయనా! కోర్టులో దేవుఁడు కనఁబడునని చెప్పితిరి. ఇపుడు దేవుడే లేఁడని యనుచుంటిరి. దేవుఁడు లేడా? లేడా?" అని స్మృతి తప్పి ఆ బల్లపైఁ బడెను.

● సమత ●